మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# ధాన్యం తేమ 17శాతానికి మించకుండా చూసుకోవాలి...

## ఎఫ్.సి.ఐ నిబంధనల మేరకు వరి కొనుగోలు కేంద్రాలు :జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధర పొందటానికి తేమ 17 శాతానికి మించకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో రైతులకు తమ ధాన్యాన్ని విక్రయించుకోవడానికి అవసరమైన మేరకు కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చేటప్పుడు తేమ శాతం 17కు మించకుండా తాలు ఎక్కువగా లేకుండా అక్కడే చూసుకోవాలని, ఎఫ్.సి.ఐ నిబంధనల మేరకు ధాన్యం తీసుకొని వచ్చి మద్ధతు ధర రూ.2060 పొందాలన్నారు. అధిక తేమ శాతం, తాలు ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొని వచ్చి అక్కడ కొనుగోలు చేయలేదని, లేదా అక్కడే ఆరబెడుతూ రైతులు ఇబ్బందులకు గురి కావద్దని సూచించారు. అకాల వర్షాలు కురుస్తుండటం వల్ల ధాన్యం తడిచిపోకుండా టార్పలిన్లు ఉపయోగించుకోవాలన్నారు. నాణ్యమైన ధాన్యం తీసుకొని రాకుండా కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాస్తూ అకస్మాత్తుగా వచ్చే వర్షాలకు ధాన్యం తడిచి మరింత ఇబ్బందులకు గురికావద్దని సూచించారు. వ్యవసాయ విస్తీర్ణాధికారుల సలహాలు, సూచనలు పాటించి ధాన్యం అమ్మడంలో ఇబ్బందులకు గురికాకుండా మద్దతు ధర పొందాలని తెలిపారు.

## కార్మికులకు గుర్తింపు కార్డులు..!

**- మే1న ప్రత్యేక వైద్య శిబిరం**

**- మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశాల మేరకు మే1న కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక శిబిరం నిర్వహించి, కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు కలెక్టర్ జి. రవినాయక్ తెలిపారు. మే డే వేడుకలపై శుక్రవారం తన చాంబర్‌లో కార్మిక శాఖ డిప్యూటీ కమి షనర్ చంద్రశేఖర్‌గౌడ్, సహాయ కమిషనర్ యాదయ్య,కామన్ సర్వీస్ సెంటర్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సోహేల్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 1నుంచి 3వరకు కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న భవన నిర్మాణ కార్మికులందరికీ గుర్తింపు కార్డులను జారీ చేయాలని చెప్పారు. ఇదీవరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాత డీఈవో కార్యాలయం వద్ద ఉన్న సహాయ కార్మిక సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం వద్ద నిర్వహించే శిబారానికి గుర్తింపు కార్డులతో హాజరుకావాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

## పంట నష్ట వివరాలను పకడ్బందిగా సేకరించాలి..

**- 33 శాతం కంటే ఎక్కువ నష్టపోతే పంట నష్టం క్రింద పరిగణించాలి**

**- జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** జిల్లాలో అకాల వర్షం వల్ల జరిగిన పంట నష్టం వివరాలను పకడ్బందిగా సేకరించాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అకాల వర్షం వల్ల జరిగిన పంట నష్టాలను అంచనా వేసేందుకు శుక్రవారం ఆర్డీఓలు, వ్యవసాయాధికారులు, ఉద్యానవన శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట నష్టం అంచనా వేసేందుకు రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి నివేధిక రూపొందించాలని ఆదేశించారు. 33 శాతం కంటే ఎక్కువ నష్టపోతే పంట నష్టం క్రింద పరిగణించాలని, అలాంటి రైతులు వారి పంట వివరాలు, ఆధార్ కార్డు, పట్టాదారు పుస్తకం, బ్యాంక్ పాసు పుస్తకం, వ్యవసాయాధికారులకు అందించాలన్నారు.

## ఆడపిల్లలందరు తమ భవిష్యత్తుకు బాధ్యత వహించేలా సాధికారతతో కూడిన జీవితాన్ని గడపాలి..

**గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**



కలెక్టర్‌ను కలిసిన
వాయిస్ ఆఫ్ గర్ల్స్ ప్రాజెక్టు మేనేజర్

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** ఆడపిల్లలందరు తమ భవిష్యత్తుకు బాధ్యత వహించేలా సాధికారతతో కూడిన జీవితాన్ని గడపాలని నిర్ధారించుకోవడానికి (వాయిస్‌ఫర్ గర్ల్స్ )బహుళ కార్యక్రమాలు నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ వల్లూరుక్రాంతి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ చాంబ్‌లో పల్లవి వాయిస్ ఫర్ గర్ల్స్ ప్రాజెక్టు మేనేజర్‌తో మాట్లాడుతూ జూన్ 25 నుండి జులై 1 వ రకు గద్వాలలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, గద్వాలలో 8,9,19వ తరగతులకు సంబంధించిన 1000 మంది విద్యార్థులకు బహిష్టు ఆరోగ్య పరిశుభ్రత, భద్రత హక్కుల గురించి వారి జీవితాలపై అవగాహన బాధ్యత కార్యాచరణ ఆధారిత శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మే 6 నుండి 13 వరకు ఎంఎల్‌డి డిగ్రీ కళాశాలకు చెందిన 100 మంది డిగ్రీ కళాశాల విద్యార్థులు శిబిరంలో పాల్గొంటారని, భవిష్యత్తులో ఉద్యోగ వారి భద్రత గురించి నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో వారి ఆరోగ్యం, భద్రత హక్కుల గురించి జ్ఞానాన్ని పొందడంలో సహాయపడటం ద్వారా వారి భవిష్యత్తును చూసుకోవడానికి సన్నద్ధం చేస్తుందని, వాయిస్ ఫర్ గర్ల్స్ అనేది లాభాపేక్ష లేనిదని, ఇది భారతదేశంలోని అట్టడుగున ఉన్న కౌమారదశలో ఉన్న బాలికలకు కార్యాచరణ ఆధారిత శిబిరాల ద్వారా క్లిష్టమైన జ్ఞానం, జీవిత నైపుణ్యాలు కమ్యూనికేషన్ నైపుణ్యాలను అందించడం ద్వారా వారి జీవితాలపై బాధ్యత వహించేలా చేస్తుందని, సున్నితమైన తరాన్ని పెంచడానికి కౌమార దశలో ఉన్న అబ్బాయిలతో కూడా వాయిస్ ఫర్ గర్ల్స్ పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం అబ్బాయిలు లింగ సమానత్వాన్ని అర్థం చేసుకోవడానికి వారి రోజువారి జీవితంలో ఆచరించడానికి సహాయపడుతుందని తెలిపారు.

## ఎర్రవల్లి కొత్త మండలంలో వల్లూరు బట్లదిన్నెలను కలపాలి..

**జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన అలంపూర్ ఎమ్మెల్యే**

**ఇటిక్యాల,ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తా గ్రామ పంచాయతీని ప్రభుత్వం కొత్త మండలంగా ఏర్పాటు చేసేందుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో భాగంగా ఇటిక్యాల మండల పరిధిలోని వల్లూరు, బట్లదిన్నె గ్రామాలను కొత్త ఎర్రవల్లి మండలంలో చేర్చాలని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యా లయంలో కలెక్టర్ వల్లూరు క్రాంతిని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం కలిసి వినతి పత్రం ఇచ్చారు. కొత్త మండలంలో కలిసేందుకు ఇప్పటికే 13 గ్రామ పంచాయతీల తీర్మాణాలను జిల్లా అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కెసిఆంతో రెండు రోజుల క్రితం సమావేశమై వల్లూరు బట్లదిన్నె గ్రామాలను కూడా కొత్త ఎర్రవల్లి మండ ల ంలో కలిపే విధంగా చూడాలని వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని సీఎం సానుకూలంగా స్పం దించినట్లు జిల్లా కలెక్టర్ ద్వారా కొత్త మండలంలో ఏఏ గ్రామాలు కలిపే జాబితాను ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపించాలని సీఎం చెప్పడం జరిగిందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం తెలిపారు.



జిల్లా కలెక్టర్‌కు వినతి
పత్రం ఇస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే

## స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ వివరాలు సరిచేయాలి..

**- వీసీలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా**



టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న
కలెక్టర్ రవినాయక్, జిల్లా అధికారులు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా గ్రామ పంచాయతీల స్వపరిక్ష వివరాలను నెలాఖారులోగా మరోసారి పరిశీలించి సరిచేసకోవాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. ఈ విషయమై గ్రామీణ్ పురస్కారాల్లో భాగంగా శుక్రవారం పీఆర్ఆర్‌డీ కమిషనర్ హనుమంతరావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ స్థాయిలో స్వపరీక్ష పూర్తయిన తర్వాత మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇదే రకమైన స్వపరీక్ష నిర్వహించి జాతీయ స్థాయి అవార్డుల కోసం పంపించనున్నట్లు తెలిపారు. మే1 నుంచి మండల స్థాయిలో ఇదే అంశాలపై బృందాన్ని నియమించడం జరుగుతుందని, గ్రామీణ అవార్డుల్లో భాగంగా ఈనెల 30లోగా బేస్‌లైన్ సర్వేకు సంబంధించి వివరాలు అన్నింటిని సరిచసేకొని సిద్ధం చేయాలని సూచించారు. తర్వాత మండల స్థాయిలో వెరిఫికేషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ జి.రవినాయక్,రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు, డీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో యాదగిరి పాల్గొన్నారు.

# నకిలి విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీంలు..!

- **నకిలీ విత్తనాల సరఫరా, క్రయ, విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు**
- **సరిహద్దుల్లో ఏడు తనిఖీ చెక్‌పోస్టులు ఏర్పాటు**
- **జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్**
- **డీఎస్పీ ఎన్‌సిహెచ్‌సి రంగస్వామి**



మాట్లాడుతున్న డీఎస్పీ రంగస్వామి



పాల్గొన్న అధికారులు, ఎంఏఓలు

**గద్వాల ప్రతినిధి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఐఎఎస్, జిల్లా ఎస్పీ సృజన ఆదేశాల మేరకు జిల్లాలో నకిలీ విత్తనాల రవాణా, క్రయ విక్రయాలపై, పటిష్ట నిఘా ఉంచాలని, అనుమతి లేని నాసిరకం పురుగుల మందులను అమ్ముతూ రైతులను మోసం చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు చేపట్టాలని పోలీస్, వ్యవసాయశాఖ అధికారులకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్‌నాయక్, డీఎస్పీ ఎన్‌సిహెచ్ రంగస్వామి తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ హాలులో వ్యవసాయ, పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో నకిలీ విత్తనాల సరఫరా, క్రయ విక్రయాలపై తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, డీఎస్పీ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మేవారిపై నిఘా ఉంచడానికి జిల్లా స్థాయిలో ఇన్స్‌పెక్టర్, వ్యవసాయ ఎడిఎ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఎస్సైలు, మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆటీంలు మేనెల 1వ తేదీ నుండి సీడ్స్ షాప్స్, మిల్లులు, ఫర్టిలైజర్ షాపులలో తనిఖీలు చేపడతాయని అన్నారు.టీంలు అన్ని కూడా జిల్లా కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలోపని చేస్తున్నాయని తెలిపారు. అలాగే సరిహద్దుల్లో 7 చోట్ల ర్యాలంపాడు, పుల్లూరు,రాజోలి, బైరాపురం, ఇర్కిచెడు, నందిన్నె, బలిగెరాలో వాహన తనిఖీ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలు జిల్లాలోకి రావడం గాని జిల్లానుండి బయటికి వెళ్లడం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే సర్టిఫైడ్ డీలర్లు మాత్రమే సీడ్స్ అమ్మేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నకిలీ సీడ్స్‌ను గుర్తించడంలో ప్యాకెట్‌పై ఎక్స్‌పైర్ డేట్, బార్‌కోడ్, లాట్ నం. మానిఫ్యాక్షరింగ్ తేదీలను గుర్తించడం గురించి తగు సూచనలు చేశారు. ఎన్ఆర్ఎంటి, నవత ట్రాన్స్ పోర్టు వాహనాలపై నిఘా ఉంచాలని అన్నారు. మంచి సీడ్స్, వెస్టేజ్ సీడ్స్ ఎలా గుర్తించాలో అధికారులకు వివరించారు. జిల్లాలో నకిలీ విత్తనాలు సరఫరా, ఉత్పత్తి రవాణా అయ్యేందుకు అవకాశం ఉన్నమార్గాలను అధికారులకు తెలిపారు. ఏదైనా కేసు నమోదు అయినప్పుడు పంచనామా వ్రాసే క్రమంలో తీసుకోవాల్సి న జాగ్రత్తలను తెలిపారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా చార్జిషీట్ వేయాలని, బస్తాలలో నకిలీ సీడ్స్‌ను గుర్తించినప్పుడు వేర్వేరు బస్తాలకు వేరు వేరు శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపాలని సూచించారు. సమావేశంలో ఎడిఎలు సక్రియానాయక్, వెంకటలక్ష్మి, సంగీతలక్ష్మి, శాంతినగర్ సిఐ శివశంకర్, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు, అన్ని మండలాల ఎంఏఓలు పాల్గొన్నారు.

# గిట్టుబాటు ధరతో రైతన్న అభివృద్ధి..!

**-వరి కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్**



జూపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తూ తెలంగాణపై సవితి తల్లి ప్రేమ చూపిస్తుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ పేర్కొన్నారు. శుక్రవారం చారకొండ మండలం జూపల్లి గ్రామంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతులను నానా ఇబ్బందులకు గురి చేసి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా ఎరువులు, విత్తనాలు సరఫరా చేయకుండా రైతన్న నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో అలసత్వం వహించి రైతుల పాలిట శాపంగా మారిందని వారు దుయ్యబట్టారు. ప్రజలు, రైతులపై చిత్తశుద్ధి ఉంటే పాదయాత్రలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో ఒకే విధమైన విధి విధానాన్ని అనుసరించాలి కానీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక విధమైన విధానాన్ని ఇతర రాష్ట్రాల్లో ఒక విధానాన్ని అవలంబించి రాష్ట్రాల అభివృద్ధి కుంటు పడేలా చేస్తున్నారని వారుపేర్కొన్నారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి సమావేశాల్లో నోటికి అదుపు లేకుండా మాట్లాడే పార్టీలకు పుట్టగతులుండవని వారు తెలిపారు. రానున్న రోజుల్లో రైతు వ్యతిరేక పార్టీలకు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.గత పాలకుల పాలనలో అప్పుల ఊభిలో ఉన్న కొట్టామిట్టాడుతున్న రైతన్నను అభివృద్ధి పర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని ఆయన పేర్కొన్నారు. రైతన్న వ్యవసాయ సాగు కోసం వ్యాపారస్థుల వద్ద అప్పులు చేయాల్సిన పని లేకుండా ఎకరాకు రూ.5వేల పెట్టుబడిని అందిస్తూ రైతు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించి రైతన్న అభివృద్ధికి దోహద పడుతుందని వారు తెలిపారు. యాసంగిలో తెలంగాణలో 36 లక్షలు ఎకరాల్లో వరి సాగు చేశారని, దేశంలో యాసంగిలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని గుర్తు చేశారు.వడ్ల కొనుగోలు విషయంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్, ఎంపీపీ నిర్మల విజయేందర్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ గుర్వయ్యగౌడ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# తాగునీటికి ఇబ్బందులు రానీయొద్దు..!

**- జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి**



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ భగీరథ నీళ్లు అందరికీ చేరేలా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో నిర్వహించిన ఒకటో స్థాయి సంఘం సమావేశం మూసాపేట జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్,దేవరకద్ర జెడ్పీటీసీ అన్నపూర్ణతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూసాపేట మండలం నందిపేట,అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి తండా, చౌడేపల్లి గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాకు కొంత ఇబ్బంది ఉందని , వెంటనే దీన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లీకేజీలను సరి చేయాలని అధికారులను ఆదేశించారు. కౌకుంట్ల రైల్వే గేట్ నుంచి ఒక కిలోమీటర్ రోడ్డు మెయింటెనెన్స్‌కు పర్మినెంట్ శాశ్వత పరిష్కారం అవసరమన్నారు.వ్యవసాయ బోరు బావుల విద్యుత్ కనెక్షన్ల కోసం స్తంభాలు లైన్ వైర్లు కొరత లేకుండా చూడాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఏడో స్థాయి సమావేశంలో గండీడ్ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి,నవాబుపేట జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్,మిషన్ భగీరథ అధికారులతో కలిసి సమీక్షించారు. వ్యవసాయానికి బోరుబావుల విద్యుత్ కనెక్షన్లు,స్థంభాలు,లైన్ వైర్ల కొరత లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల వారీగా వచ్చిన వివరాలు ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. గండీడ్ మండలం గోవిందాయపల్లిలోని పురాతన దేవాలయానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. రాజాపూర్, తిరుమలాపూర్,భూత్పూర్,పోతులమడుగులో మిగిలిన ఆర్అండ్ఆర్ రోడ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. గండీడ్, మహ్మదాబాద్, మిడ్జిల్ మండలాల్లో కొంత నీటి సమస్య ఉన్నదని త్వరితగతిన పరిష్కరించాలనా కోరారు. పంచాయతీరాజ్ రోడ్ల విషయంలో భాగంగా మిగిలిపోయినరోడ్లను జెడ్పీ సీఈవో జ్యోతి,డిప్యూటీ సీఈవో మొగులప్ప, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కెటిఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు..

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటిశాఖ మంత్రి కల్వకుంట్ల రామారావును ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్, నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,నారాయణపేట జడ్పీ ఛైర్‌పర్సన్ వనజ ఆంజనేయులుగౌడ్, మహబూబ్‌నగర్ జిల్లా జడ్పీఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డిలు ఉన్నారు.




ఐటిశాఖ మంత్రి కెటిఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

# చారకొండ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు...



స్వాధీనం చేసుకున్న నగదు



డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్

**అచ్చంపేట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** చారకొండ తహసీల్దార్ కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. చారకొండ మండలం శేరిఅ ప్పారెడ్డిపల్లి గ్రామంలో సర్వే నెం.120, 121, 122 లలో మొత్తం 12 ఎకరాల భూమి 12 మందికి విక్రయించారు. ఫిబ్రవరి 7 నాడు 7 స్లాట్లు బుక్ చేసుకొని తహసీల్దార్ కార్యాలయానికి వస్తే ఫిబ్రవరి 7వ తేదీ నుంచి ఫిబ్రవరి14 వరకు బుకింగ్ స్లాట్లకు రిజి స్ట్రేషన్లు చేయకుండా తహసీల్దార్ నాగమని, ధరణి ఆపరేటర్ రాజులు ఇబ్బందులకు గురి చేశారు. ఒక్కొ దస్తావేజుకు రూ. 25వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో ఏప్రిల్ 13న 4 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. వాటికి సంబంధించి రూ.1లక్ష ఇవ్వా లని సూచించారు. 10 రోజుల వరకు దస్తావేజులు సదరు వ్యక్తులు ఇవ్వకపోవడంతో అతను చేసేదేమి లేక మహబూబ్‌నగర్‌లోని ఏసీబీ కార్యాలయంలో సంప్రదించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు 75వేలు ఇవ్వాలని సూచించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1.30 తహసీల్దార్, ఆపరేటర్ రాజులను సంప్రదించి డ బ్బులు తీసుకొచ్చానని సూచించడంతో బయట వీఆర్ఎ భర్త వెంకటయ్యకు ఇవ్వా లని చెప్పడంతో అతనికి డబ్బులు ఇస్తుంటే ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ ఆధ్వర్యం లో దాడులు చేసి పట్టుకున్నారు. తహసీల్దార్ నాగమణి, ధరణి ఆపరేటర్ రాజు, వెంకటయ్యలను అదుపులోకి తీసుకున్నామని, శనివారం నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు అడిగి ఇబ్బందులకు గురి చేస్తే 106 కు సమాచారమివ్వాలన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు..

**నారాయణపేట ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు**



రోడ్డు ప్రమాదాల నివారణపై సూచనలిస్తున్న ఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం నేషనల్ హైవే ఎన్‌హెచ్ 167 మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్‌కోట చౌరస్తా నుండి జక్లేర్ చౌరస్తా వరకు మొత్తం 25 కి.మీ. వరకు రోడ్డు ప్రమాదాలు జరిగే యాక్సిడెంట్స్ ప్రోన్ ఏరియాస్‌ను 9 గుర్తించి పరిశీలించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరిగేవి మరికల్‌పరిధిలో తీలేరు, గేట్ మరికల్ చౌరస్తా, ఆత్మకూర్ రోడ్డు, పసుపుల గేట్, ఎన్మోనిపల్లి టర్నింగ్, గుడిగండ్ల మలుపు దగ్గర ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సిఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి ఎస్పీకి తెలిపారు. నేషనల్ హైవేపై గ్రామాల నుండి ప్రధాన రహదారిపైకి వచ్చే ప్రతి రోడ్డు మార్గాన స్పీడ్ బ్రేకర్లు వేయించాలని, వాటికి వైట్ పెయింట్‌తో కలర్స్ వేయించాలని ఎస్పీ సూచించారు. నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రధాన చౌరస్తాల్లో బారికేడ్స్ ఏర్పాటు చేయలని, స్పీడ్ నియంత్రణ కొరకు స్పీడ్ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయాలని, రేడియం స్టిక్కర్స్ వేయించాలని, మలుపుల దగ్గర రేడియం స్టిక్కర్స్‌తో బోర్డులు వేయించాలని తెలిపారు. రాత్రి సమయంలో రహదారిపై వాహనాలు నిలిచి ఉండడం వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున హైవే పెట్రోల్ వాహనాలు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ రోడ్డుపై ఎలాంటి వాహనాలు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని మిగతా వాహనాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజిబుల్ పోలీసింగ్‌గా ఉండి విధులు నిర్వర్తించాలని పెట్రోలింగ్ పోలీసులకు తెలిపారు. వాహనాల వేగ నియంత్రణ కొరకు 80 కి.మీ. స్పీడ్ దాటితే స్పీడ్ గన్‌ద్వారా చలాన్స్ విధించాలని, వాహనదారులకు కనిపించే విధంగా ఇంకాకొన్ని స్పీడ్ నియంత్రణ సూచికలు అవసరమైన చోట వేయించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. జిల్లాలో ప్రజలందరు నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్పీతో పాటు సిఐ శ్రీకాంత్‌రెడ్డి, మరికల్ ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శిగా యం.పాండు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా పాఠశాలల క్రీడల నిర్వహణ కార్యదర్శిగా వెల్దండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు యం. పాండు నియమితులయ్యారు. రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆమోదంతో జిల్లాలోని సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులైన యం.పాండుకు జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శిగా నియామక పత్రాన్ని డీఈఓ గోవిందరాజులు శుక్రవారం అందించారు. గ్రామీణ స్థాయిలో ప్రతిభ ఉన్న నిరుపేద క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించి పాఠశాల స్థాయి క్రీడలను బలోపేతం చేయాల్సిన బాధ్యత జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శికి ఉంటుందని డీఈఓ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరం పున: ప్రారంభం తర్వాత నూతన కార్యదర్శి నేతృత్వంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ గల పేద క్రీడాకారులను గుర్తించి స్కూల్ గేమ్స్‌కు జిల్లా జట్టును ఎంపిక చేసి గ్రామీణ ప్రాంత క్రీడలను బలోపేతానికి చర్యలు తీసుకోనున్నట్లు నూతన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాండు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ జిఎఫ్ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, రాజన్‌గౌడ్, మల్లయ్య తదితరులు ఉన్నారు.



యం.పాండుకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

## దేవరకద్రలో ఘనంగా వాసవిమాత పల్లకిసేవ..!

**-అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు**



**దేవరకద్ర, ఎప్రిల్ 28 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తులు హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారి సన్నిధిలో అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదతర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**ఘనంగా కుంకుమార్చన..** దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. మహామంగళహారతి,ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్‌ఓసీ చెక్కులు అందజేత...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** తాడూర్ మండలం యాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మెరుగైన వైద్య చికిత్సలు చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వెంకటేష్‌కు నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.1.50లక్షల ఎల్‌ఓసీ చెక్కును, బిజనపల్లి మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన పోస్ట్‌మాస్టర్ యాదయ్య మనువరాలు సహస్రకు గుండెకు సంబంధించిన ఆపరేషన్ నిమిత్తం రూ.1లక్ష ఎల్.ఓ.సీ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి ద్వారా ఎంతో మంది నిరుపేదలు మెరుగైన వైద్య సేవలు చేయించుకోవడానికి సీఎం కేసీఆర్ ఒక మంచి అవకాశాన్ని అందించారని, దీంతో ఎంతో మంది తమ ప్రాణాలను కాపాడుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తదితరులు ఉన్నారు.



ఎల్‌ఓసీ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

## ప్రతి ఒక్కరూ వక్తలుగా ఎదగాలి..

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** సమాజాభివృద్ధిలో ప్రత్యేక విశిష్టత కలిగిన వ్యక్తులుగా ఎదిగేందుకు కృషి చేస్తూ ప్రతి ఒక్కరు వక్తలుగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్‌జీ పేర్కొన్నారు. నైజాం విముక్త మహోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ప్రతిష్టిత వ్యక్తుల సమావేశం కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజాం నిరంకుశ పాలనలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు అనేక కష్టాలు అనుభవించారని, వాటి నుంచి విముక్తి పొందడానికి సర్దార్ వల్లభాయి పటేల్ లాంటి మహాయోధులు గ్రామ రక్షక దళాలను ఏర్పాటు చేసి బానిస పాలన నుంచి విముక్తి కలిగించారని, దీని కోసం వారి త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరు సెప్టెంబర్ 17న గ్రామ గ్రామాన ముువ్వెన్నెల జెండాను ఎగురవేస్తూ నిజాం విముక్త పాలన మహోత్సవాలను నిరాడంబరంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో విభాగ్ సంగ్ చాలకులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, జయరాంతో పాటు అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, ఆమనగల్లు, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి వక్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న
తెలంగాణ రాష్ట్ర ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్‌జీ

## పేదోడి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందిస్తాం...

**-ఎల్లికట్ల గ్రామంలో హత్ సే హత్ జోడో కార్యక్రమం**

**కల్వకుర్తి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలం ఎల్లికట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో హత్ సే హత్ జోడో కార్యక్రమాన్ని గ్రామ ప్రజలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా నాయకులు గ్రామంలో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, కల్వకుర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డిలు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మౌళిక వసతుల సదుపాయాలు సరిగ్గా లేవని, గ్రామం అభివృద్ధిలో కుంటు పడిందన్నారు. ఎంతో మందికి పక్కా ఇండ్లు లేవని, కొంత మందికి ఉన్న ఆ ఇండ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, వారందరికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పక్కా ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాండుగౌడ్, చంద్రకాంత్‌రెడ్డి, అనిల్‌గౌడ్, బాలరాజు, లింగమయ్య,శేఖర్, సైదులుయాదవ్, ఆంజనేయులు, సుదర్శన్, రవి, గణేష్, కృష్ణయ్య, ఖయ్యూం, మణ్యం, వెంకటయ్య, ఎల్లయ్య, రాములు తదితరులు ఉన్నారు.



ఫోటోరైటప్ : 07 : కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ చేస్తున్న దృశ్యం

# రైతు కష్టం తెలిసిన వ్యక్తి సీఎం కేసీఆర్...

**-రైతును రాజు చేయడమే లక్ష్యం -ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ చైర్ పర్సన్ శాంతకుమారి**

**కల్వకుర్తి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**సీఎం కేసీఆర్ రైతు కష్టం తెలిసిన వ్యక్తి కావడంతోనే అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలుస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి దిగ్విజయంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ చైర్ పర్సన్ శాంతకుమారిలు అన్నారు. శుక్రవారం కల్వకుర్తి సింగిల్‌విండో సొసైటీ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన కల్వకుర్తి మండలంలోని ఎల్లికల్, పంజుగుల, తర్నికల్, రఘుపతిపేట, మార్చాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ చైర్ పర్సన్ శాంతకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం కేసీఆర్ కావడం మన అదృష్టమని, దేశంలో ఎక్కడ లేని విధంగా రైతుల నుంచి 100 శాతం ధాన్యం కొనుగోలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం దేశంలోనే తెలంగాణ ప్రభుత్వమన్నారు. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలతో ముందుకు సాగుతుందన్నారు. రైతులు పండించిన పంటలకు దళారి వ్యవస్థ లేకుండా నేరుగా కొనుగోలు చేసి వారి ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తూ మనోధైర్యం కల్పిస్తుందన్నారు. వ్యవసాయ అనుబంధ సంస్థలకు తెలంగాణ రాష్ట్రం పుట్టినిల్లుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఎంపీపీ సామ మనోహర చెన్నకేశవ, ఎఎంసీ చైర్మన్ విజయ్‌గౌడ్, వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు బాలస్వామి, దేశం సునిత వెంకట్‌రెడ్డి, రేణుక, ఎంపీటీసీ సునితకుర్మయ్య, సంతోషి మల్లేష్, నాయకులు బాలయ్య, రాముునాయక్, పురం రాంరెడ్డి, మదన్‌మోహన్‌రావు, అశోక్, తాజుద్దిన్, దారమోని గణేష్, వట్టెపు కిశోర్, ఎస్ఐ రమేష్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



మార్చాల గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే పర్మినెంట్ చేయాలి

**పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు సంతోష్**

**కోయిల్‌కొండ, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు సంతోష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర కమిటి పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రమైన కోయిల్‌కొండలోని ఎంపిడిఓ కార్యాలయంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నాలుగు సంవత్సరాల గడువు ముగిసినప్పటికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన రెగ్యులరైజేషన్‌కు సంబంధించినటువంటి రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన ఎటువంటి ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి వెలుబడనందున సమ్మెకు దిగడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజేషన్ చేస్తూ జిఓ విడుదల చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గడిచిన నాలుగు సంవత్సరాల ప్రొహిబిషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు అందరిని జెపిఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ పనిచేసే కాలాన్ని ప్రొహిబిషన్ పీరియడ్‌లో భాగంగా పరిగణించాలన్నారు. మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. అర్హులైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అందరికి వెంటనే ప్రమోషన్లు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 జిఓ వల్ల నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు వెంటనే న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పట్ల సానుకూలంగా స్పందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న దృశ్యం

## న్యాయవాదుల సహకారంతోనే విజయవంతంగా కేసులు పరిష్కరించగలిగాను:సీనియర్ సివిల్ జడ్జీ కుమారస్వామి



సీనియర్ సివిల్ జడ్జీ కుమారస్వామిని సన్మానిస్తున్న న్యాయవాదులు

**కల్వకుర్తి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**కల్వకుర్తి కోర్టులో సీనియర్ సివిల్ జడ్జీ కుమారస్వామి బదిలీ సందర్భంగా శుక్రవారం కోర్టు ఆవరణలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా సివిల్ జడ్జీ స్వరూపరాణి హజరయ్యారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న కుమారస్వామి మాట్లాడుతూ తాను వచ్చిన స్వల్ప కాలంలో న్యాయవాదుల సహకారం వల్ల కోరును విజయవంతంగా నడపగలిగానని, న్యాయమూర్తి అనే వారికి అన్ని తెలియాలని లేదని, నిత్యం నేర్చుకోవడం వలనే కేసుల పరిష్కారంలో సత్వరం పరిష్కరించగలుగుతామన్నారు. కల్వకుర్తి కోర్టులో బార్ బెంచ్ రిలేషన్ బాగుందని, తెలంగాణలోని ఉత్తమ బార్‌లలో కల్వకుర్తి బార్ ఒకటని ఆయన తెలిపారు. అంతకు ముందు కుమారస్వామిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వి.లక్ష్మణశర్మ, వెంకటేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, కిష్టయ్య, లక్ష్మినారాయణ, వెంకట్‌గౌడ్, జగన్, జమీల్, అమరేందర్, లక్ష్మణ్ రాజు, జయంత్, ఎస్.మల్లేష్, యాదిలాల్, సుధాకర్‌రెడ్డి, రాంగోపాల్, నాగరాజు, శ్రీకాంత్, కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రైతులకు అందుబాటులో వరి కొనుగోలు కేంద్రాలు..

**కోయిల్‌కొండ, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** రైతులకు అందుబాటులో ఉండే విధంగా రైతు చెంతకే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపిపి శశికళ భీంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పారుపల్లి, షేరి వెంకటాపూర్, చంద్రాస్‌పల్లి, అనంతపూర్, ఆచార్యపూర్, ఇబ్రహీంనగర్ తదితర గ్రామాలలో మండలం జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఎంపిపి శశికళ భీంరెడ్డి, ఆయా గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి చివరి గింజదాకా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతు బాగుకోసం రాష్ట్రప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పారదర్శకంగా పని చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. మండలంలో ఐకెపి, సింగిల్‌విండో సొసైటీల ద్వారా వరి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బి. కృష్ణ, మండల వైస్ ఎంపిపి పారుపల్లి కృష్ణయ్య, జిల్లా రైతు సమన్వయ కమిటి సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సమన్వయకర్త మల్లయ్య యాదవ్, చంద్రాస్‌పల్లి సర్పంచ్ గోపాల్, వెంకటాపూర్ సర్పంచ్ సుందరమ్మ మోహన్‌రెడ్డి,ఉపసర్పంచ్ రాఘవులు, ఇబ్రహీం నగర్ సర్పంచ్ ఎం. రాములు, ఎంపిటిసి ఆంజనేయులు యాదవ్, ఆచార్యపూర్ సర్పంచ్ టి. రాముశర్మ, ఎంపిడిఓ జయరాం, ఐకెపి ఎపిఎం విజయకుమారి, ఐకెపి సిసిలు మల్లేష్, నరేష్, వెంకటాపూర్ బుక్ కీపర్ కృష్ణ, ఇబ్రహీంనగర్ బుక్ కీపర్లు రాజు, చెన్నయ్య పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాలను
ప్రారంభిస్తున్న ఎంపిపి, జడ్పీటిసి ప్రజా ప్రతినిధులు

## 138వ మేడే వాల్‌పోస్టర్ విడుదల



మేడే వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

**మద్దూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు 138వ మేడే వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియ్ ఐఎఫ్‌టియు అనుబంధం మండల అధ్యక్షులు అంజి మాట్లాడుతూ 1886లో మే 1న చికాగో పోరాటం 8 గంటల పని సమయన్ని సాధించారు. కాని నేడు పని గంటలను 12 గంటలకు పెంచడం అంటే రాతియుగంలోకి పోవడమా, 138 సంవత్సరాల కింద అమెరికా చికాగో నగరంలో ఎనిమొది గంటల పనికోసం పోరాడి సాధించుకుంటే ఇప్పుడు కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం 12 గంటల కార్మిక వర్గాన్ని పని చేయమనడం అంటే కార్మికులతో వెట్టిచాకిరి చేయించడమే అన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వాలు బడి కంపెనీల కోసమే యజమానులకు సేవచేయడం కోసమే పనిగంటల పెంపు 44కార్మిక చట్టాలరద్దు లాంటి చర్యలకు దిగారన్నారు. మే 1న జరిగే 138వ మేడేను కార్మికవర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా సంయుక్త మండలాల కార్యదర్శి కొండా నరసింహులు, రైతుసంగం మండల నాయకులు బి.రాములు, వెంకటప్ప, పివైఎల్ నాయకులు వినయ్, లాలప్ప, పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి గౌస్, మండల అధ్యక్షుడు విజయ్, గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి..

**నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ ఎర్రవల్లి సర్పంచ్ రవి**

**ఇటిక్యాల,ఏప్రిల్28 ప్రభాతవార్త:**అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి కెసిఆర్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రొహిబిషన్ పీరియడ్ ముగిసినందున ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని రవి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వారికి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల సహకారంతోనే సర్పంచ్‌లు పనులు చేపడుతున్నట్లు అదేవిధంగా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నట్లు అందుకు రాష్ట్రం, కేంద్రం ప్రతిష్టాత్మక అవార్డులు కూడా అందిస్తుందని గుర్తు చేశారు. అలాగే 317 జిఓ వల్ల నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలని పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలని అలాగే అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రెండు నెలలుగా జీతాలు లేని పంచాయతీ కార్యదర్శులకు తనవంతుగా ఆర్థిక సహాయం చేసి వారికి అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



జీతాలు లేని పంచాయతీ కార్యదర్శులకు తనవంతు ఆర్థిక సాయం
అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ రవి

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



**కల్వకుర్తి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని ఇందిర నగర్ కాలనీకి చెందిన కుంభం గణేష్ భార్య రాజేశ్వరి ప్రసవ సమయంలో ఒక పాపనకు జన్మనిచ్చి తాను చనిపోయింది. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బృంగి ఆనంద్‌కుమార్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.3వేల ఆర్థిక సహాయం అందించారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పద్మ చిన్న, మాజీ కౌన్సిలర్ మబ్బు రామరాజు, నాయకులు చిత్తారి శ్రీనివాసులు, బండారి శ్రీనివాసులు, పోల ప్రవీణ్‌కుమార్, సాయికిరణ్, పోలే మహేష్, బాలకృష్ణ, గిరి, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెబాట..

**కెటిదొడ్డి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ముందు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను ప్రారంభించారు. జోగు లాంబ అసెంబ్లీ సాక్షిగా సీఎం కెసిఆర్ ఇచ్చిన హామీలు నెరవే ర్చాలంటూ ప్రభుత్వంపై జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కదం తొక్కేందుకు సిద్దమవుతున్నారు. ప్రొహిబిషన్ పీరియడ్ ముగిసి నందున జిఓ 26 ను అమలు చేస్తూ ఉద్యోగాలను క్రమబద్ధీకరించా లని శుక్రవారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె ప్రారంభిం చారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్లతో పాటు సంబంధిత అధికారులకు సమ్మె నోటీసు సైతం అందజేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేపడుతున్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు పోతురాజు శంకరమ్మ సేవాదళంతో చేస్తున్న సేవలు

**పోతురాజు సోమనాద్రిని అభినందించిన ఎర్రవల్లి సర్పంచ్ రవి**

**ఇటిక్యాల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండేరు గ్రామానికి చెందిన పోతురాజు సోమనాద్రి విదేశాలలో స్థిరపడిన ఆయన తన తల్లి పోతు రాజు శంకరమ్మ జ్ఞాపకార్థం పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులతో మండల పరిధిలోని నిరుపేద కుటుంబాలకు తనవంతుగా ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా రెండు రోజుల క్రితం విదేశాల నుండి సొంత గ్రామం కొండేరు గ్రామానికి వచ్చిన పోతురాజు సోమనాద్రిని శుక్రవారం ఎర్రవల్లి గ్రామసర్పంచ్ రవి శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.శంకరమ్మ సేవాదళంతో ఇలాంటి సేవలు నిరుపేద కుటుంబాలకు అందించాలని ఆయన ఆకాంక్షించారు.



## లక్ష్మీపల్లిలో కనకదుర్గాదేవికి అభిషేకాలు..

**దేవరకద్ర,ఎప్రిల్ 28 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలో శుక్రవారం శ్రీ కనకదుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు.విశేష దినోత్సవం సందర్భంగా ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అష్టోత్తరములతో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అలాగే మహామంగళ నీరాజనం తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



## కౌకుంట్లలో ముగిసిన గ్రామదేవతల ప్రథమ వార్షిక మహోత్సవాలు

**-ఘనంగా పెద్దమ్మతల్లి బోనాల వేడుకలు**



**దేవరకద్ర,ఎప్రిల్ 28 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో గ్రామదేవతల ప్రథమ వార్షిక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిసాయి. కౌకుంట్లలో బోడ్రాయి,పెద్దమ్మ,కోటమైసమ్మ,కర్రెమ్మ గ్రామ దేవతల ప్రథమ వార్షిక మహోత్సవాలు ఈ నెల 26న ప్రారంభమయ్యాయి.ఈ మహోత్సవాలలో భక్తి టీవి కోటీదీపోత్సవ ప్రధాన అర్చకుడు రేవల్లిరాజుశర్మ అధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.మహోత్సవాల ముగింపురోజు పెద్దమ్మతల్లి బోనాల వేడుకలను నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా మహిళలు బోనాలను తీసుకొని ఊరేగింపుగా అమ్మవారి గుడివద్దకు చేరుకొన్నారు.సన్నాయివాయిధ్యాలు,శివసత్తుల పూనకాల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది.గుడిచుట్టూ ప్రదిక్షణలు అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలే చేసి నైవేధ్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## సమ్మెకు దిగిన పంచాయతీ కార్యదర్శులు



ఇటిక్యాల మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెకు దిగిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

**ఇటిక్యాల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేసే వరకు నిరవధిక సమ్మె చేస్తామని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి కెసిఆర్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను మూడేళ్ల తర్వాత రెగ్యులరైజేషన్ చేస్తామని హామీఇచ్చి నేటికి ప్రభుత్వం నెరవేర్చడం లేదని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఈనెల 20వ తేదీ వరకు గడువు ఇచ్చామని ప్రభుత్వం స్పందించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరవధిక సమ్మెకు పిలుపునివ్వడంతో అందులో భాగంగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల పరిధిలోని 19 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ప్రభుత్వం స్పందించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారికి సీనియర్ పంచాయతీ కార్యదర్శులు మద్దతు పలికారు. నిరవధిక సమ్మెలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు మహిళా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీశేషదాసుల మధ్య ఆరాధన



శ్రీశేషదాసుల మధ్య ఆరాధనలు నిర్వహిస్తున్న దృశ్యం

**మల్దకల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** మల్దకల్ శ్రీ శేషదాసుల 138వ ఆరాధన ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మధ్యారాధన ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, పవమాన హోమం, అర్చనలు ఘనంగా వేదమంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. శేషదాసుల వంశస్థులు దీరేంద్రదాస్, రాఘవేంద్ర, విష్ణు, శేషగిరిదాస్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి ఊరేగింపుగా భజన మండలి ఆధ్వర్యంలో హరినామ సంకీర్తనలు చేస్తూ దాసులకట్ట దగ్గర పూజలు నిర్వహించారు. అనంతరం శేషదాసుల చరిత్రను, మహిమలను వేద పండితులు సత్యప్రియ, రామాచారి, పవనాచారి కొనియాడారు. ప్రతి ఒక్కరు గురువు చూపిన బాటలోనే నడవాలని తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు, భీమసేనచారి, మోహన్‌రావు, భీమసేనరావు, గిరిరావు, నాగరాజుశర్మ, భక్తులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఉట్కూర్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** ఉట్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా అంగన్‌వాడి సెక్టార్ మీటింగ్‌లో హాజరై ప్రసవాల సంఖ్య పెంచాలని, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు తగు పరిచర్యలు పోషకాహారము గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు నరసింహులు, ఆరోగ్య కార్యకర్త సుజాత, అంగన్‌వాడి పర్యవేక్షకులు గీత, అంజలి, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాహన చోదకులకు ట్రాఫిక్ ఎస్సై కౌన్సిలింగ్



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** గద్వాల వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి ప్రాణాలు కాపాడుకోవాలని గద్వాల ట్రాఫిక్ ఎస్సై విజయ్ భాస్కర్ సూచించారు. జిల్లా ఎస్పీ సృజన, డీఎస్పీ హెచ్. రంగస్వామి ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం గద్వాల పట్టణ కేంద్రంలోని గాంధీచౌక్ కూడలి వద్ద వాహన చోదకులకు ట్రాఫిక్ నియమాలపై ట్రాఫిక్ ఎస్సై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై విజయభాస్కర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, బంధవులు, స్నేహితులు ఎవరైనా సరే మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన అన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ఊహించని ప్రమాదాలు జరిగినప్పుడు వారి కుటుంబాలు వీధిన పడతాయన్నారు. ఓ విధంగా హెల్మెట్ మనల్ని కాపాడి కుటుంబాలకు మేలు చేస్తుందన్నారు. అలాగే పరిమితికి మించిన వేగం మంచిది కాదన్నారు. అతివేగం ప్రమాదకరమన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న చలానాలు వెంటనే చెల్లించాలని సూచించారు. పెండింగ్‌లోఉన్న చలానాలు ఏ విధంగా తెలుసుకోవాలో వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది శివకుమార్, రామకృష్ణ, సుధాకర్, కలిమ్, బలరాం పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ అధ్యక్షుడిని సన్మానించిన జర్నలిస్టులు



**మక్తల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** పట్టణంలోని జర్నలిస్టుల ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ నూతన అధ్య క్షుడిగా నియమించబడిన అంబదాసు రావును జర్నలిస్టులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షులు దేవసూగూరు సురెందర్, టియడబ్ల్యుజె 143 జిలా ప్రధాన కార్యదర్శి మామిళ్ల పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగావారు మాట్లాడుతూ జర్నలిస్టుగా దశాబ్దంపైగా పనిచేస్తున్న అంబదాస్ రావు లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. పలువురు జర్నలిస్టులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో సీనియర్ జర్నలిస్టు అంజన్ ప్రసాద్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, లక్ష్మా రెడ్డి, రవికుమార్‌గౌడ్, శంకర్‌కుమార్, శ్రీనివాసులు, దినేష్, కార్తీక్ పాల్గొన్నారు.

## నేటి నుండి శ్రీతిమ్మమ్మ అవ్వ జాతర బ్రహ్మోత్సవాలు

**ఇటిక్యాల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉదండాపురం గ్రామంలో శ్రీ తిమ్మప్ప అవ్వ వార్షిక జాతర బ్రహ్మోత్సవాలు నేటినుండి కొనసాగుతున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. 28,29తేదీలలో పూజలు, 30న ఆదివారం సాయంత్రం రథోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రజలుతెలిపారు. అదేవిధంగా జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 30న ఆదివారం మొదటి రోజు 6 పళ్ల విభాగం బండలాగుడు పోటీలు, మే 1వ తేదీన న్యూ కేటగిరి విభాగం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

# 2వ విడత గొర్రెల పంపిణీని విజయవంతంగా లబ్ధిదారులకు అందించాలి

**● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2వ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు పశువైద్య డాక్టర్లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పశుసంవర్ధక శాఖాదికారి ఆద్వర్యంలో 2వ విడత గొర్రెల పంపిణీ సన్నాహక సమావేశాన్ని ఎంపీడీఓలు, పశువైద్య డాక్టర్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో గొల్ల కురుమ యాదవుల కోసం సబ్సిడీ ద్వారా గొర్రెలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2వ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. 2వ విడతలో అర్హులైన 19762 మంది లబ్ధిదారులను గుర్తించడం జరిగిందన్నారు. సొసైటీలో పేర్లు నమోదు చేసుకొని ఇప్పటికే మృతి చెందినట్లు అయితే లేదా ఇతర కారణాల వల్ల లబ్ధిదారుడి పేరు మార్చాల్సి వచ్చినప్పుడు అందుకు సంబంధించిన నామిని వివరాలు, మరణ ధృవీకరణ పత్రం, ఆధార్ తదితర వివరాలను పంచాయతీ సెక్రటరిలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల వారిగా తీసుకొని లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇప్పటికే గుర్తించిన లబ్ధిదారులకు ఒక గుర్తింపు కార్డును ఇవ్వడం జరిగిందన్నారు. లబ్ధిదారుల పశువైద్యాధికారిణి సంప్రదించి తన వాటా ధనం రూ.47,750లు కట్టే విధంగా చూడాలన్నారు. సొసైటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీఓ నర్సింగ్‌రావు, డీపీఓకృష్ణ, జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి, ఎంపీడీఓలు, పశువైద్య డాక్టర్లు తదితరులు ఉన్నారు.

## కల్వకుర్తి పట్టణాన్ని స్వచ్ఛ కల్వకుర్తిగా మార్చుకుందాం!

**- కల్వకుర్తి మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం**



క్యారీ బ్యాగులను అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** పట్టణ పరిధిలోని తడి, పొడి చెత్తలను వేరు చేయాలని, దాని వలన కలిగే ఉపయోగాలు గుర్తించి ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో డబ్ల్యూడబ్ల్యూ సంస్థ వారిచే 11వ వార్డు ప్రజలకు కౌన్సిలర్ కుడుముల చైతన్య కిశోర్‌రెడ్డితో కలిసి మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను ఏ విధంగా వేరు చేయాలో, చెత్తను వేరు చేయడం వలన పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించొచ్చు అని, భూమిపై పేరుకుపోయే చెత్తను తొలగించొచ్చు అని తెలియజేశారు. తడి చెత్తుతో ఎరువును తయారు చేయడం, పొడి చెత్తతో రీసైక్లింగ్ చేయుటకు చర్యలు చేపడుతామని, హానికరమైన చెత్తను ఒక ప్రత్యేకమైన ప్యాకింగ్ చేసి ఇవ్వాలని, దానిని సిమెంట్ ఫ్యాక్టరీకి తరలించి సిమెంట్ తయారు చేయిస్తామన్నారు. అదే విధంగా పట్టణంలోని ప్రజలందరికి ఆర్‌పీలు, మహిళా సంఘాల వారి సహకారంతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం క్యారీ బ్యాగులను అందించారు. కార్యక్రమంలో కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, 21వ వార్డు కౌన్సిలర్ సైదులుబాబు, ఎన్విర్యాన్మెంట్ ఇంజనీర్, జవాన్లు, డ్రైవర్లు, మహిళాసంఘాల వారు సిబ్బంది, పట్టణ ప్రజలు తదితరులు ఉన్నారు.

## పోటీ పరీక్షలపై విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



విద్యార్థులతో టాస్క్ రిసోర్స్ పర్సన్ బృందం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాగర్‌కర్నూల్‌లో ఈ నెల 27,28 తేదీల్లో విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో తరగతులు బోధించడానికి టాస్క్ రిసోర్స్ పర్సన్ టీ.వెంకటేష్ మెంటల్ ఎబిలిటి మరియు అప్టిట్యూడ్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు టాస్క్ కోఆర్డినేటర్ షేక్ ఖాజాబి తెలిపారు. రెండు రోజులు పూర్తిగా విద్యార్థులకు అర్థమెటిక్, రీజనింగ్ లాంటి క్లాసులను మంచిగా వివరించారు. క్లాసులతో పాటుగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మోటవేషన్ నిర్వహించారు. విద్యార్థులు కూడా టాస్క్ రిసోర్స్ పర్సన్ వెంకటేష్ చెప్పిన క్లాసులను ఎంతో ఆసక్తిగా విన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షల కోసం ఉపయుక్తమైన తరగతులను బోధించినందుకు కళాశాల ప్రిన్సిపల్ కమర్ షాజహాన్ సుల్తాన, వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఖాజాబి, అధ్యాపకులు, విద్యార్థులు టాస్క్ రిసోర్స్ పర్సన్ వెంకటేష్‌ను సన్మానించి అభినందించారు.

## కారెక్కిన వైఎస్ఆర్‌టీపీ నేత రవిప్రకాష్

**- కండువా కప్పి ఆహ్వానించిన ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న రవిప్రకాష్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** వైఎస్సార్‌టీపీ కీలక నేత రవిప్రకాశ్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షుడు, వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ప్రస్తుతం మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవిప్రకాశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో శుక్రవారం పార్టీలో చేరారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ అభివృద్ధికి చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా నిలిచే పార్టీ బీఆర్ఎస్ అని వెల్లడించారు. పార్టీలో క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. బీఆర్ఎస్ భవిష్యత్తు ఉన్న పార్టీ అని వెల్లడించారు. పార్టీలో అందరికీ అవకాశాలు ఉంటాయని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిరుద్యోగ దీక్షను విజయవంతం చేయండి

**- డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి పిలుపు**



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 30న నిర్వహించే నిరుద్యోగ దీక్షను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ నుంచి క్లాక్‌టవర్ వరకు నిరుద్యోగ ర్యాలీ నిర్వహించిన అనంతరం క్లాక్‌టవర్ సర్కిల్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహిస్తామన్నారు. అనంతరం టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేండ్లుగా నీళ్ల, నిధులు, నియామకాలు లేకుండా చేశారని పేర్కొన్నారు. అనంతరం జిఎంఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక 1.07లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ చెప్పారని, ప్రస్తుతం రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు బిస్వాల్ కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ఉద్యోగాలు పోయాయే తప్పా కొత్త ఉద్యోగాలు రాలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని నిరుద్యోగులకు యువతకు భరోసా కల్పించేందుకు నిరుద్యోగ నిరసన దీక్షకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కావునా ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు ఘనస్వాగతం పలకాలని కోరారు. అనంతరం ర్యాలీకి సంబంధించి డీఎస్పీతో చర్చించి, కార్నర్ మీటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, ఎర్రశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, వినోద్, కాటం వినోద్, రంగారావు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీ నెరవేర్చాలి : జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



సమ్మె నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులు

**గండీడ్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** నాలుగేళ్ల సర్వీస్ పూర్తిచేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ మండిపడుతుంది. అదనంగా మరో ఏడాదికాలం ఈనెల11 నాటికి మొత్తంగా నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసిన తమను రెగ్యులర్ చేయకపోవడంపై జిపిఎస్‌లు ఆందోళన బాటపట్టారు. గండీడ్ మండలంలో పని చేస్తున్న జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు నిరవధిక సమ్మెతో పోరుబాట పట్టారు. జూనియర్ పంచాయతీ సెక్రెటరీ సంఘం ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టి గండీడ్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కార్యాలయం ఎదుట దీక్షకు దిగారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9 వేలకు పైగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారని ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో సమ్మె చేపట్టినట్లు చెప్పారు. వాస్తవానికి జెపిఎస్‌ల నియామకం సమయంలో మూడు సంవత్సరాలు ఇలాంటి అవకతవకలకు పాల్పడకుండా తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో మొక్కలు ఎండిపోకుండా గ్రామ పంచాయతీల అభివృద్ధికి పాటుపడే వారిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, వారికి ఇచ్చిన నియామక పత్రాల్లోనూ మూడేళ్ల కాంట్రాక్టు కాలపరిమితి తర్వాత ఉద్యోగాలు రెగ్యులర్ అవుతాయని స్పష్టంగా ఉత్తర్వులు ఇచ్చారని వారన్నారు. అయితే అదనంగా దీన్ని మరో ఏడాది ప్రభుత్వం పొడిగించిందని ఇప్పటికే నాలుగు సంవత్సరాలు గడుస్తున్నప్పటికి ఇంకా తమను రెగ్యులర్ చేయకపోవడంపై జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాము సమ్మెనోటీసు ఇవ్వాల్సి వచ్చిందని జూనియర్ కార్యదర్శులు చెబుతున్నారు. ఈసందర్భంగా గండీడ్ మండల కార్యదర్శులుమాట్లాడుతూ సీఎం కెసిఆర్ దత్తపుత్రికగా చెప్పుకునే పల్లె ప్రగతి కార్యక్రమం కార్య దర్శులు అహర్నిశలతో సత్ఫలితాలను ఇచ్చిందని అన్నారు. తెలంగాణకు పారిశుద్ధ్యంలో ఎన్నో అవార్డులు రావడానికి పంచాయతీ కార్యదర్శులు కారణమని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. ప్రతి కార్యదర్శి గ్రామాల్లోఎంతో క్రియాశీలంగావ్యవహరించారని చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వం చెప్పిన నాలుగు సంవత్సరాల గడువు పూర్తయినప్పటికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన ఎటువంటి ఉత్తర్వులు వెలువడనందున నిరవధిక సమ్మెకు సిద్ధం అయ్యామని పేర్కొన్నారు. రెగ్యులరేషన్ వ్యవహారంలో కీలక హామీ వచ్చేదాకా సమ్మె విరమించే ప్రసక్తే లేదని అన్నారు.

## తెలంగాణలో అదుపు తప్పిన ప్రభుత్వ పాలన

**● టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్**



**దేవరకద్ర, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** తెలంగాణలో ప్రభుత్వ పాలన పూర్తిగా అదుపు తప్పిందని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దేవరకద్ర నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఒక న్యాయం, ప్రజలకు ఒకన్యాయం చేపడుతున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ చేపట్టిన ప్లీనరీ సమావేశంలో సాక్షాత్తు దళితబంధు కమిషన్ల వ్యవహారంపై బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను హెచ్చరించడమనేది ఒక రకంగా ప్రోత్సాహం కల్పించినట్లుగా ఉందని కాంగ్రెస్ విశ్వసిస్తుంద న్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అరచేతిలో వైకుంఠాన్ని చూపుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తుందన్నారు. త్వరలో బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు.

## మాజీ సర్పంచ్‌కు నివాళి



వెంకటర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** కావేరమ్మ పేట మాజీ సర్పంచ్ వర్ధంతి సందర్భంగా జడ్చర్ల పురపాలక సంఘం పరిధిలోని కావేరమ్మపేటలోని వెంకటర్‌రెడ్డి విగ్రహానికి నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మి, పంచాయతీ మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్‌రెడ్డి, జ్యోతికృష్ణారెడ్డి, ముడా డైరెక్టర్ ప్రీతం, నాయకులు దోరెపల్లి రవీందర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం

**ఇటిక్యాల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన రామ్‌గోపాల్ కుమారుడు యోగానందం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొన్ని నెలల క్రితం మరణించారు. ఈ సందర్భంగా చికిత్సకు ఆయన ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగా శుక్రవారం అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, వల్లూరు గ్రామానికి చేరుకుని బాధితకుటుంబానికి 2లక్షల 40 వేలరూపాయల సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మం డల రైతుసమన్వయ సమితిఅధ్యక్షులు గిడ్డారెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

## భారత ఫుట్‌బాల్ జట్టు సభ్యుడిని అభినందించిన ఎమ్మెల్యే ఆల



**దేవరకద్ర, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో శుక్రవారం భారత ఫుట్‌బాల్ జట్టు సభ్యుడిని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు. ఏప్రిల్ 20 నుండి 24వ తేదీ వరకు ఫిలిప్పీన్స్ దేశంలో జరిగిన ఏషియా 7ఎస్ ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన ఫుట్‌బాల్ ఆటగాడు తేజరెడ్డి పాల్గొని తమ ప్రతిభను చాటారు. దీంతో ఆ క్రీడాకారుడిని మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరెందర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఆల అభినందించారు.

## రైతులు పండించిన ప్రతిధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

**● సింగిల్‌విండో ఛైర్మన్ జంబుల హనుమంత్‌రెడ్డి**

**లింగాల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** రైతులు పండించిన ప్రతిధాన్యం గింజను కొనుగోలు చేస్తామని సింగిల్ విండో ఛైర్మన్ జంబుల హనుమంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తకుంపల్లి, దత్తారం గ్రామాలలో ఏర్పాటు చేసిన వారి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా సింగిల్ విండో ఛైర్మన్ జంబుల హనుమంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతన్నలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కి రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేశంలోనే రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కెసిఆర్‌కు దక్కిందన్నారు. రైతుల వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి గ్రేడ్ ఎ రకానికి మద్దతు ధర రూ. 2060, గ్రేడ్ బి రకానికి మద్దతు ధర రూ. 2040 రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఆరబెట్టిన తరువాతనేకొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పర్వతాలు, డైరెక్టర్ బాలరాజుగౌడ్, ఉపసర్పంచ్ కురుమయ్య, సుందర్‌రెడ్డి, విష్ణురెడ్డి, జైపాల్‌రెడ్డి, రాజు, కాశీం, సత్యనారాయణ రైతులు పాల్గొన్నారు.



# కోయిల్‌సాగర్ పనిముట్లు పదిలం

**దేవరకద్ర,ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ ఎలా నిర్మించి ఉంటారనే ఆలోచన ప్రతి ఒక్కరికి ఉంటుంది. ప్రాజెక్టు అందాలను తిలకించడానికి వచ్చిన ప్రతి సందర్శకులకు ఈ ఆలోచన రానే వస్తుంది. ప్రాజెక్టు ఎంత పటిష్టంగా ఉండడానికి ఏ పని ముట్లు వాడారనే సందేహం కూడా కలుగుతుంది.కాని ప్రాజెక్టు నిర్మాణానికి వాడిన పనిముట్లు ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి అంటే నమ్మకం కలగదు కదా...ఖచ్చితంగా ప్రాజెక్టు నిర్మించేటప్పుడువాడిన పనిముట్లు అక్కడే పదిలంగా ఉన్నాయి. అప్పట్లో కోయిల్‌సాగర్ కట్టేటప్పుడు తీసిన ఫొటోలు కూడా పదిలంగా ఉన్నాయి. వాటిని చూస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది.1947-1955 మధ్య కాలంలో ఈ ప్రాజెక్టు నిర్మించారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిర్మించి ఏడాదికి 65 ఏళ్లు అవుతున్నాయి. అప్పట్లో ఎంతో చాకచక్యంగా ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సున్నం, గచ్చు ఉపయోగించి ప్రాజెక్టును నిర్మించారు.ఈ మిశ్రమం తయారుచేయడానికి పెద్దపెద్ద ఇనుప పనిముట్లు వాడారు. ఓ పెద్ద ఇనుప పనిముట్టు (డంగ్)ను ఉపయోగించి సున్నం, గచ్చు మిశ్రమాన్ని తయారుచేసి ప్రాజెక్టు ఆనకట్ట రాళ్లమధ్యలో సిమెంట్ మాదిరిగా ఉపయోగించారు. ఈ మిశ్రమాన్ని తయారు చేయడానికి అప్పట్లో చేసిన గోతులు కూడా ఇప్పటికి పదిలంగా ఉన్నాయి.పెద్ద ఇనుపచక్రం, ఇనుప చక్రాలు తదితర సామాగ్రి అంతా ప్రాజెక్టు సమీపంలోని కొండాపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో ఎడమవైపు చెట్లమధ్యఉన్నాయి.అప్పట్లోప్రాజెక్టు నిర్మాణానికి ఉపయోగించిన పరికరాలకు ఎలాంటి భద్రత లేకుండా పోయింది.ప్రాజెక్టుకు దూరంగా ఉండడంతో ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకులకుఇవి ఏమాత్రం కనిపించడం లేదు.తెలిసిన వారుఅక్కడికి వెళ్తేకాని ఈ విషయం ఎవరికితెలియదు.కావున ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రాజెక్టు నిర్మాణానికి ఉపయోగించిన పనిముట్లు పర్యాటకులు చూసేలా ప్రస్తుతం ఉన్న గెస్ట్‌హౌజ్ సమీపంలో ఉంచిదానిని సూచించే బోర్డుపెడితే బాగుంటుందని పర్యాటకులు కోరుతున్నారు.

**ఫొటోలు కూడా పదిలం...**

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిర్మించేటప్పుడు దశలవారిగా అప్పట్లో ఎంతో చాకచక్యంతో ఫొటోలు కూడా తీశారు. ఆ ఫొటోలు కూడా ఇప్పటికి ప్రాజెక్టు అధికారులు కార్యాలయంలో భద్రంగా ఉన్నాయి. ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసినప్పటి నుండి ప్రాజెక్టు పూర్తయ్యే వరకు దశల వారిగా దాదాపు 20 ఫొటోలు తీశారు. కావున ఈ ఫొటోలను కూడా అందరు చూసేలా ప్రాజెక్టు గెస్ట్ హౌస్‌లో ఒక గ్యాలరీ ఏర్పాటు చేస్తే చాలా బాగుంటుందని పర్యాటకులు కోరుతున్నారు. గతంలో తీసిన ఫొటోలు అప్పటి పనితనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**- నిర్మించేటప్పుడు తీసిన ఫొటోలు కూడా పదిలం**



కోయిల్‌సాగర్ ప్రాజెక్టును నిర్మిస్తున్న కూలీలు

1: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఉపయోగించిన ఇనుప చక్రాలు.
2: ప్రాజెక్టు నిర్మించేటప్పుడు సున్నం, గచ్చు కలిపి ఆ మిశ్రమాన్ని సిమెంట్‌లా తయారు చేయడానికి అప్పట్లో తీసిన గోతి
3: కోయిల్‌సాగర్ నిర్మాణానికి ఉపయోగించిన పెద్ద ఇనుప చక్రం
4: కోయిల్‌సాగర్ నిర్మాణానికి ఉపయోగించిన చిన్న చక్రాలు
5: ప్రాజెక్టు నిర్మాణానికి మిశ్రమాన్ని కలపడానికి ఉపయోగించిన పెద్ద పల్లెం



(1) (2) (3) (4) (5)

## సుందరీకరణ పనులు పూర్తి చేయాలి

**● ట్యాంక్‌బండ్ ఐలాండ్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి.రవినాయక్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** మే మొదటి వారంలో రాష్ట్ర ఐటి, మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి కె. తారకరామారావు మహబూబ్‌నగర్ పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల నిమిత్తం వస్తున్నందున ట్యాంక్‌బండ్‌లో చేపట్టిన ఐలాండ్, నెక్లెస్ రోడ్డు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్న దృష్ట్యా ఐలాండ్‌పై శిలాఫలకం వేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్ ట్యాంక్ బండ్‌లో చేపట్టిన నెక్లెస్ రోడ్, ఐలాండ్, సస్పెన్షన్ బ్రిడ్జి పనులను తనిఖీ చేశారు. మే మొదటి వారంలో రాష్ట్ర ఐటిశాఖ మంత్రి నెక్లెస్ రోడ్డు, ఐలాండ్ సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారని, ఇందుకుగాను సైక్లింగ్ ట్రాక్‌తో పాటు, వాకింగ్ ట్రాక్,గజగోలు తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. అదేవిధంగా కొత్తగా ట్యాంక్ బండ్ నుండి ఎలాంటి అడ్డంకులు లేకుండా శుభ్రంగా ఏర్పాటు చేయాలనిఅన్నారు. ట్యాంక్ బండ్‌లో మరిన్ని టిప్పర్లను మనుషులను ఏర్పాటు చేసి చదువునే చేసే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందుకుగాను ఎక్కువ మంది మనుషులను పెట్టాలని కాంట్రాక్టర్ దామోదర్‌రెడ్డిని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు,ఇరిగేషన్ ఎస్ఈ చక్రధరం, ఇరిగేషన్ ఇంజనీర్లు, కాంట్రాక్టర్ దామోదర్‌రెడ్డి తదితరులు జిల్లా కలెక్టర్ ఉన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మక్తల్ మండల పరిధిలోని వినాయకుంట గ్రామంలో అప్పుల బాధ తాళలేక చేసిన అప్పు కట్టడం కొరకు అప్పు ఇచ్చిన వ్యక్తి భూమి పట్టా చేసుకుని వేధింపులు చేస్తున్న సంఘటన గ్రామస్తులకు చెప్పి ఇకనేను ఉండలేను అంటూ తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వినయ్‌కుంట గ్రామానికి చెందిన కృష్ణ (39) తనకున్న కొద్దిపాటి పొలంలో అప్పుచేసి బోర్లువేసి పంట పండించుకునే వాడు. గతంలో పక్క గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి ఆరులక్షల రూపాయలు తీసుకుని తనభూమి ఒక ఎకరా గిరి రిజిస్ట్రేషన్ పేరుతో చేయించారు. సదరు భూమి చేయించుకున్న వ్యక్తి తరచుగా వేధింపులకు గురి చేశారని గ్రామస్తులు తెలిపారు. అప్పు కట్టలేక ఆత్మహత్య చేసుకున్న కృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని సమాచారం తెలిసిన పోలీసులు కేసు ఎందుకు నమోదు చేయలేదని వివిధ ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు. కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్న కాలయాపన చేస్తున్న పోలీసులపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రాజకీయ నాయకులకు ఏమైనా ఒత్తిళ్లు ఉన్నాయా జిల్లా అధికారులు స్పందించి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న కృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.



ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి (ఫైల్)

# గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

**● గీతా కార్మిక సంఘం నాయకుడు శ్యాంసుందర్‌గౌడ్**

**ఉట్కూర్,ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని గీతా కార్మిక సంఘం నాయకులు శ్యాంసుందర్‌గౌడ్ కోరారు.శుక్రవారం మండలంలోని వల్లంపల్లి గ్రామ శివారులో ఈత వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉట్కూర్ మండలంలోని వల్లంపల్లి గ్రామ శివారులో 9 ఎకరాల్లో 5 వేల ఈత మొక్కలను నాటడం జరిగిందని తెలిపారు. అప్పట్లో ఉపాధి పథకం ద్వారా 5 వేల మొక్కలు పంపిణీ చేశారని వాటిలో ప్రస్తుతం 16 వేల మొక్కలు పెరిగా యని తెలిపారు. ఈత మొక్కల సీడ్ సరిగా లేకపోవడం వల్ల మొక్కలు పెరగలే దని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా రెండేళ్లలో ఈత మొక్కలు పెరిగితే కల్లు గీయ డానికి వస్తాయని తెలిపారు. మొక్కలు ఎండిపోయిన స్థానంలో ఎక్సైజ్‌శాఖ అధికా రులు స్పందించి మంచి సీడ్‌గల మొక్కలను పంపిణీ చేయాలని కోరా రు. నారాయణపేట గీతా సంఘంలో 200ల కుటుంబాలు సభ్యత్వం కలిగి ఉన్నాయని తెలిపారు. అర్హులైన గీత కార్మికులకు ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్‌రూంలు, గీతా కార్మికుల పిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్లో అడ్మి షన్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భరత్‌గౌడ్, కృష్ణగౌడ్, శంకర్‌గౌడ్, నరసింహులుగౌడ్ పాల్గొన్నారు.



ఈత వనాన్ని సందర్శిస్తున్న దృశ్యం

## ఉట్కూర్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన డీఎస్పీ

**ఉట్కూర్,ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో రికార్డులను డీఎస్పీ సత్యనారాయణ పరిశీలించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసుల వివరాలను ఎస్సై రాములు అడిగి తెలుసుకున్నారు.అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం తమకుకేటాయించిన గ్రామాలలో విధులు నిర్వహించి తిరగాలని పోలీసులకు తెలిపారు.కార్యక్రమంలో సిఐసీతయ్య, ఎస్సై రాములు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## దళితులకు అండగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

**● అలంపూర్ ఎమ్మెల్యే డా.విఎం అబ్రహాం ● చిన్న తరహా వ్యాపారాల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ**

**ఉండవల్లి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** శుక్రవారం అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి ద్వారా చిన్న తరహా వ్యాపారముల పథకం ద్వారా 39 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి రూ. 50 వేల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని చెక్కులు పంపిణీ చేసిన అలంపూర్ ఎమ్మెల్యే డా.విఎం అబ్రహాం ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు దళితులను పట్టించుకున్న పాపాన పోలేదు. దళితులంటే చిన్నచూపుగా చూసేవారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ దళితులను కూడా అన్ని విధాలుగా అండగా ఉంటూ దళితులు కూడా ఆర్థికంగా ఎదగాలని ఎలాంటి పక్షపాతం లేకుండా, దళితులు కూడా తెలంగాణ ప్రజలే అంటూ ఎలాంటి వర్గ బేధాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ ఏదో రూపంలో ప్రతి ఒక్కరికి కెసిఆర్ మేలుచేస్తూ, తెలంగాణ రాష్ట్ర ప్రజలు అన్ని వర్గాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని, అహర్నిశలు కృషి చేస్తూ, తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ అధికారంలో వచ్చిన తరువాతే, అన్ని వర్గాల ప్రజలకు మత్స్యకారులకు, గొల్ల కురువ ఇలా అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమిస్తున్న నాయకుడు దేశంలోని ఏకైక నాయకుడు కెసిఆర్ అని పేర్కొన్నారు. గ్రామాలలో గ్రామ పంచాయతీ అభివృద్ధి కొరకు అన్ని విధాలుగా అన్ని వసతులను ఏర్పాటు చేసి, గ్రామాలలో పచ్చదనం, పారిశుద్ధ్యం, గ్రామాలలో ప్రజలందరూ ఆరోగ్యంతో,సుఖ సంతోషాలతో జీవించాలని, గ్రామాలలో ఎప్పుడో ఒకప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా గ్రామాలలో మంచి చెట్లనుపెంచి ప్రజలకు మంచి ఆరోగ్యంగా లభించే విధంగా అన్ని విధాలుగా గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పనిచేయడంజరుగుతుందని, అన్నివర్గాల ప్రజలకు అండగా ఉండే నాయకుడు కెసిఆర్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న అలంపూర్ ఎమ్మెల్యే డా.విఎం అబ్రహాం , పాల్గొన్న మహిళలు

## మంత్రి నిరంజన్‌రెడ్డిపై చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు

**● సమగ్ర విచారణ జరిపి కృష్ణానదిని రక్షించాలని రాచాల వినతి**

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బిసి పొలిటికల్ జెఎసి తెలంగాణ రాష్ట్ర ఛైర్మన్ రాచాల యుగందర్‌గౌడ్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ట్రిబ్యునల్ కార్యాలయంలో రిజిస్ట్రార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లా మానోపాడు మండలం చండూరు గ్రామం, ఉండవల్లి మండలం మారు మునగాల గ్రామాలు కృష్ణానది సమీపంలో ఉన్నాయని, ఈ నదికి ఆనుకుని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, అతని కుటుం సభ్యులు కొంత భూమిని కొనుగోలు చేసి, కృష్ణానది ఒడ్డున ఉన్న తమ వ్యవసాయ భూమిని చదును చేసేందుకు 6 నెలలకు పైగా అక్రమ పూడికతీతకు పాల్పడ్డారని వారి వ్యవసాయ భూమికి ఆనుకుని ఉన్న కృష్ణానది నుండి చట్ట విరుద్ధంగా, అక్రమంగా యాభై వేలకు పైగా క్యూబిక్ మీటర్ల మట్టిని తీసుకున్నారని ట్రిబ్యునల్‌కు వివరించారు. అంతే కాకుండాకృష్ణానది పరివాహక ప్రాంతాన్ని(శ్రీశైలం ప్రాజెక్టు ముంపు భూములు)సైతం ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు.కావున ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి, కృష్ణానదిని రక్షించాలని కోరారు.




## వేసవిలో పిల్లలపట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

**ఉండవల్లి ఎస్సై కె. బాలరాజు**

**ఉండవల్లి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఉండవల్లి ఎస్సై కె. బాలరాజు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ ఎండవేడి నుండి సేదతీరడానికి సరదా కోసం తోటి స్నేహితులతో కలిసి సమీపంలోని చెరువులు, కుంటలు,బావుల వద్దకు ఈతకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ఈత సరదా కోసంవెళ్లిన పిల్లలకు నీటిలో లోతు తెలియక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, ఈతకు వెళ్లిన విద్యార్థులు ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఎండలు విపరీతంగా పెరుగుతున్నందున పిల్లలు ఇంటి నుంచి బయటకు పంపించవద్దని కోరారు. మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు చేతికిచ్చి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని, మైనర్ పిల్లలు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడితే యజమానిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే వరకు పిల్లలకు మేధాశక్తి ఉపయోగపడేలా సాంకేతిక పరిజ్ఞానంతో పిల్లలకు కాలక్షేపం అయ్యేలా చూడాలని ఎస్సై కె. బాలరాజు తెలిపారు.



# ఆరోగ్య యోగం



▶▶ యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం
▶▶ మనస్సు, శరీరాన్ని అనుసంధానం చేసేందుకే యోగాభ్యాసం

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**

**ప్రతి నిత్యం ఉదయం మొదలు కొని రాత్రి వరకు విరామం లేకుండా ఉరుకులు, పరుగులు జీవితానికి కాసింత ఉత్సాహం కావాలి.. క్షణం తీరిక లేకుండా గడుపుతున్న ఈ రోజుల్లో మనస్సుకు ఉల్లాసం లేకపోతే ఏదో కలత.ఏపని చేయలేక పోతాం..ఇలాంటి పరిస్థితుల్లో శరీరం ఏపని చేయాలన్న మొరాయిస్తుంది.శారీరక ,మానసిక సమస్యలకు యోగా విరుగుడు అంటున్నారు వైద్య నిపుణులు, ఆరోగ్య నిపుణులు. డిజిటల్ ప్రపంచంలో ఆరోగ్య యోగంపై వార్త ప్రత్యేక కథనం..**

యమ,నియమ,ఆసన,ప్రాణాయామ, ప్రత్యాహార,ధారణ,ధ్యాన, సమాధి అనే అంశాలు యోగాలో నిక్షిప్తమై ఉన్నాయని యోగానిపుణులుపేర్కొన్నారు. యమ నియమాలన్ని సమయాల్లో నిర్వర్తించాల్సినవే. మిగతా ఆరు అంశాలు సాయం సంధ్యల్లో నిర్వర్తించదగినవి. సాధారణంగా మనిషి ఒక సారి శ్వాస తీసుకుంటే ఆక్సీజన్ 400 ఎంఎల్ నుండి 500 ఎంఎల్ ఉంటుంది. అదే యోగా సాధనలో ప్రాణాయామం ద్వారా శ్వాస తీసుకుంటే 4000 నుండి 5000 ఎంఎల్ అవసరముంటుంది.అంటే పదిరెట్లు శ్వాస తీసుకోవడం వల్ల శరీరానికిప్రాణాయామం చేకూర్చే మేలు ఎంతో తెలుస్తుంది. రోజు వారి దినచర్యలో భాగంగా నిత్యం యోగా సాధన వరుస క్రమంలో చేయాల్సి ఉంటుందని యోగానిపుణుల అభిప్రాయం.యోగా,జాగింగ్‌లో పలు రకాలు ఆసనాలు, సూక్ష్మ వ్యాయామం,ప్రాణాయామం, ధ్యానం, శాంతి సూక్తం. పలు ఆసనాలు సాధన చేయాలని యోగానిపుణుల సలహా.

**1.సూర్యనమస్కార్:** రెండు కాళ్లను నిటారుగా ఉంచాలి. రెండు చేతులను నమస్కార్ స్థితిలోకి తీసుకెళ్లాలి. అనంతరం సూర్యభగవాణుడు సూర్యనారాయణునికి నమస్కారం చేసుకోవాలి. నమసా ్కర్ స్థితిలోనే నెమ్మదిగా చేతులను కిందకి తీసుకొస్తు పాదాలను తాకించాలి. అనంతరం రెండు చేతులను నేలపై అరచేతులను ఆణించాలి. ఎడమ కాలును వెనక్కి పంపాలి. కుడికాలుపై 1 నిమిషం పాటు అలాగే ఉండాలి. రెండుకాళ్లను వెనక్కి పంపాలి.అనంతరం రెండు అరచేతులపై భారం వేయాలి. వెనక్కి పంపిన ఎడమకాలును యధాస్థితిలోకి తీసుకరావాలి.అనంతరం కుడికాలును యధాస్థానంలోకి తీసుకురావాలి. నిటారుగా నిలబడి సూర్యనమస్కార్ చేస్తుసూర్యభగవాణునికి నమస్కారం చేయాలి. ఇలా 5సారు ్ల చేస్తే రక్తప్రసరణకు ఎంతోలాభం చేకూరుతుంది. కాళ్ల నొప్పులు, మోకాళ్లనొప్పులు తొలగిపోతాయి. ఉదయం లేదా సాయంత్రం వేళ 10 నిమిషాల సమయం పాటుసాధన చేస్తే ఆరోగ్యంగాఉంటారని యోగానిపుణుల అభిప్రాయం.

**2. వజ్రాసనం:** దండాసనంలో కూర్చోవాలి. పద్మాసనంలో కూర్చొని ప్రథమంగా ఎడమకాలును వెనక్కి మడవాలి.అనంతరం కుడికాలును వెనక్కి మడవాలి. రెండు మోకాళ్లపై కళ్లు మూసుకొని ధ్యానం చేస్తు 10 నిమిషాల పాటు వజ్రాసనంలో కూర్చోవాలి. అనంతరం వెనక్కి మడిచిన ఎడమ,కుడి కాలును యధాస్థితికి తీసుకరావాలి. పద్మాసనంలో కూర్చోవాలి. అనంతరం పద్మాసనంలో ఇష్టదైవాన్ని స్మరించుకొని 10 నిమిషాల పాటు ధ్యానం చేయాలి.

**3.వక్రాసనం:** దండాసనంలోనే కూర్చొని కుడికాలును మడచుకొని తొడవద్ద ఆనించాలి. ఎడమ కాలును చక్కగా ఉంచాలి. ఎడమ చేతిని కుడిపాదం వైపు. ఎడమ దిశ పొట్ట మధ్యకు తెచ్చి పాదం వద్ద నిలపాలి.కుడిచేతిని నడుము భాగం వైపు వెనుక భూమిపై చక్కగా ఉంచాలి. మెడను కుడివైపుకు తిప్పాలి. ఇలా రెండవ వైపు చేయాలి. వక్రాసనం ప్రయోజనం: నడుము వద్ద కొవ్వును తగ్గిస్తుంది. కాలేయం, ప్లహమునకు ఎంతో లాభం చేకూరుతుంది.

**4. గోముఖాసనం:** ప్రథమంగా నేలమీద కూర్చోవాలి. ఎడమ కాలును మడచుకొని మడమను కుడివైపు వద్ద ఉంచాలి. అనంతరం కుడికాలు వంచి ఎడమ పాదం వైపు రెండు మోకాళ్ల ఒకదానికొకటి స్పర్శించునట్లు వేయాలి.కుడిచేతిని పైకి లేపి వీపువైపునకు తిప్పి ఎడమ చేతిని వీపువెనుక నుండి తెచ్చి కుడి చేతిని పట్టుకొని మెడ,నడుము చక్కగా ఉంచాలి. ఒకవైపు నుండి దాదాపు ఒకనిమిషంపాటు చేసి అనంతరం ఇదే విధంగా రెండోవైపు చేయాలి.

గోముఖాసనం ప్రయోజనం.. అండకోశ వృద్ధి ప్రేగులకు బలం చేకూరు తుంది. ధాతు రోగం,బహుమూత్రం,స్త్రీలకు వచ్చే వ్యాధులను నియం త్రించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. కాలేయం, మూత్రపిండాలకు బలాన్నిస్తుంది. కీళ్లవాతంను తగ్గిస్తుంది.

**5. పవన ముక్తాసనం:** వెల్లకిలా కాళ్లు రెండు చాపి అనంతరం కాళ్లను మడవాలి.రెండు చేతులతో కాళ్లను పట్టుకొని మోకాళ్లను పొట్ట వైపు మడచినొక్కి పట్టాలి.శ్వాస వదులుతూతలనుపైకి లేపాలి. మెల్లగా శ్వాస తీసుకుంటూ తల,కాళ్లు కింద పెట్టాలి.ఇలా రెండు సార్లు చేస్తే ఉచ్వాస, నిస్వాసలు గాలి వెలుపలికి వచ్చే స్తుంది.పవనముక్తానం సాధనవల్ల కలిగే ప్రయోజనం.గ్యాస్‌ట్రబుల్ ,తేన్పుల సమస్య ఉండదు. పొట్టలోని కొవ్వును తగ్గిస్తుంది. గుండెజబ్బు, కీళ్ల రోగాలు నయమవుతాయి. నడుమునొప్పితగ్గుతుంది.మలబద్ధకం సమస్య తగ్గిపోతుంది.

**6. అనులోమ..విలోమ ప్రాణాయామం:** ముందుగా నేలపై వెలకిలా నిటారుగా పడుకొని రెండు కాళ్లు పైకెత్తి నిటారుగా ఉంచాలి.తలపై లేచి రెండు కాళ్లను చూస్తు రెండు చేతులు నడుముకు ఆనించి ఉంచాలి. అనంతరం ప్రాణాయామం శ్వాస పీలుస్తు వదులుతూ ధ్యానం చేయాలి. ప్రాణాయామం ద్వారా ప్రయోజనం. నాడులను శుద్ధి చేస్తుంది. గుండెలో బ్లాకేజ్‌లను తొలగిస్తుంది. మానసిక రోగాలు దూరమవు తాయి. మెదడుకు శక్తి లభిస్తుంది.రెండు కాళ్లను మడచుకొని పద్మాసన స్థితిలో కూర్చొవ్వాలి. ప్రథమం కుడిచేతి,ఎడమచేతి వేళ్లను యోగ ముద్రలోకి తీసుకెళ్లాలి.10 నిమిషాలపాటు ధ్యానం చేయాలి. ధ్యానం అనంతరం కళ్లు తెరచుకొని మళ్లీ ధ్యానం చేస్తు ఇష్టదైవాన్ని స్మరించుకోవాలి.

**7.పద్మాసనం.. 8.సూర్యనమస్కార్...**

రెండు కాళ్లను నిటారుగా ఉంచాలి. రెండు చేతులను నమస్కార్ స్థితిలోకి తీసుకెళ్లాలి. అనంతరం సూర్యభగవాణుడు సూర్యనారాయణునికి నమస్కారం చేసుకోవాలి. నమసా ్కర్ స్థితిలోనే నెమ్మదిగా చేతులను కిందకి తీసుకొస్తు పాదాలను తాకించాలి. అనంతరం రెండు చేతులను నేలపై అరచేతులను ఆణించాలి. ఎడమ కాలును వెనక్కి పంపాలి. కుడికాలుపై 1 నిమిషం పాటు అలాగే ఉండాలి. రెండు కాళ్లను వెనక్కి పంపాలి.అనంతరం రెండు అరచేతులపై భారం వేయాలి. వెనక్కి పంపిన ఎడమకాలును యధాస్థితిలోకి తీసుకరావాలి. అనంతరం కుడికాలును యధాస్థానంలోకి తీసుకురావాలి. నిటారుగా నిలబడి సూర్యనమస్కార్ చేస్తు సూర్యభగవాణునికి నమస్కారం చేయాలి.ఇలా 5 సార్లు చేస్తే రక్తప్రసరణకు ఎంతో లాభం చేకూరుతుంది. కాళ్ల నొప్పులు, మోకాళ్లనొప్పులు తొలగిపోతాయి. ఉదయం లేదా సాయంత్రం వేళ 10 నిమిషాల సమయం పాటు సాధన చేస్తే ఆరోగ్యంగా ఉంటారని యోగానిపుణుల అభిప్రాయం.

# ఆగమవుతున్న అన్నదాత

**దిక్కుతోచని స్థితిలో మొక్కజొన్న రైతు : జికె ఈదన్న, రైతుసంఘం అధ్యక్షుడు**

**ఉండవల్లి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** ఆరుగాలం శ్రమించి పొద్దస్తమానం కష్టపడి, సమయానికి తినక, కంటి నిండా నిద్రలేక, కంటికి రెప్పోలే కాపాడుకున్న పంట కళ్లముందే సరైన ధరలేక ఉన్న ధరకు అమ్ముకోలేక కడుపు నిండక ఏమి చేయాలో తెలియని దీనగాథ మొక్కజొన్న రైతుది. గతకొన్ని రోజులుగా మొక్కజొన్నను కొనుగోలు చేయండి, మహాప్రభో అంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మార్క్‌ఫెడ్ అధికారులకు వివిధ రూపాలలో విన్నవించిన సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం మొక్కజొన్న ధర క్వింటాలుకు 1600ల రూపాయలు మాత్రమే దక్కుతుంది. కనీస మద్దతు ధర కన్నా 300లకు పైగా క్వింటాలు మీద నష్టపోతావున్నాడు. దీని నివారించేందుకు అధికార యంత్రాంగం మాత్రం ఈ విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా రేపు మాపు అంటూ మొక్కజొన్న రైతులను మరింత లోతులలోకి తీసుకువెళ్తుంది. అనడానికి ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే పంటసగ కోతలు పూర్తయిన,బహిరంగ మార్కెట్లోధర లేకున్నా అకాల వర్షాతో పంట కళ్లముందే తడిసిపోతున్న ఏమి చేయేక రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతూ ఉన్నాడు అధికారులు ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలని, రైతులు వివిధ సంఘాల నాయకులు కోరుతున్నారు.



ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం